క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: 11 కేవీ జార్జిపేట ఫీడర్ మెయింటినెన్స్, చెట్లు తొలగించటానికి లైన్ క్లియర్ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని గుంటూరు -2 డీఈఈ ఎస్.గురవయ్య గురువారం తెలిపారు. డీ8 సెక్షన్ పరిధిలోని జార్జిపేట, పట్టాభిపురం మెయిన్‌రోడ్డు, కృష్ణనగర్ 1వ లైను ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మణిపూర్‌లో హింసకు ముగింపు పలకాలి



లక్ష్మీపురం: మణిపూర్‌లో మరోమారు తలెత్తిన తీవ్ర హింసాత్మక పరిస్థితులు యావత్ దేశాన్ని కలవరపెడుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని హింసకు ముగింపు పలకాలని విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. మణిపూర్‌లో హింస తీవ్ర రూపం దాల్చడంపై దేశ ప్రజలందరూ ఆందోళన చెందుతున్నారని తెలిపారు. అక్కడ శాంతిని తిరిగి నెలకొల్పేందుకు, అన్ని జాతుల హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ జాతుల ప్రాతిపదికన హత్యలు, ప్రతీకార హత్యలతో హింస పెచ్చరిల్లిన పరిస్థితులు మణిపూర్‌లో నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యావేత్త సీహెచ్. అనంతరామయ్య, అధ్యాపకులు సుబ్బారెడ్డి, ఇంజనీర్ సదాశివం ప్రసంగించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : ఐద్వా



లక్ష్మీపురం: విశాఖలో లా విద్యార్థినిపై సామూహిక అత్యాచారం చేయడం సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన పరిస్థితి అని, దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా సంఘం జిల్లా, నగర అధ్యక్షులు జి.రమణ, పి.పద్మ డిమాండ్ చేశారు. శంకర్‌విలాస్ సెంటర్‌లో గురువారం ఐద్వా మహిళా సంఘం ఆధ్వర్యంలో దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా సత్వరమే బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. మహిళలు, చిన్నారులపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, పోర్న్ వీడియోస్, అశ్లీల సాహిత్యాన్ని నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగిని అనురాధ, సీఐటీయూ నాయకులు షేక్ ఖాసిం షాహిద్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు షేక్ సమీర్, ఐద్వా నగర కార్యదర్శి ఏ కల్యాణి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎం. రమాదేవి, పద్మ, అచ్యుత కుమారి పాల్గొన్నారు.

గ్రంథాలయ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ నిర్వహించిన వివిధ పోటీల్లో మాజేటి గురవయ్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ మాధవపెద్ది విజయలక్ష్మి తెలిపారు. బ్రాడీపేటలోని కళాశాలలో గురువారం జరిగిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నగర విద్యా చరిత్రలో దశాబ్దాలుగా మాజేటి గురవయ్య విద్యాసంస్థలు మంచి విద్యాబోధనతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసానికి కృషి చేస్తున్నాయని చెప్పారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన పోటీల్లో జూనియర్ ఇంటర్ విద్యార్థి ఎస్.మోహనకృష్ణ ప్రథమ, వక్తృత్వ పోటీలో తృతీయ బహుమతి సాధించినట్లు వివరించారు. క్విజ్ పోటీల్లో షేక్ సాదిక్, వరుణ్ సాయి, ప్రభాకర్ ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు సాధించారని చెప్పారు. శ్రీకృష్ణ దివ్యజ్ఞాన సమాజం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో సైతం విద్యార్థి మోహనకృష్ణ ఉత్తమ ప్రతిభను ప్రదర్శించి తృతీయ బహుమతి సాధించినట్లు పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ మాజేటి వెంకట రామకోటి ముత్యాలు, అధ్యాపకులు విజేతలకు అభినందనలు తెలియజేశారు.

సం'క్షోభ' హాస్టళ్లు





రాజాగారితోటలోని ఎస్సీ బాలికల(చిన్న పిల్లల) హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న మురుగు పారుదల వ్యవస్థ | సక్రమంగా లేని మరుగుదొడ్ల నిర్వహణ



నందివెలుగు రోడ్డు ఎస్సీ బాయ్స్ హాస్టల్‌లో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

- మౌలిక వసతులు కరువు
- విద్యార్థులకు అవస్థలు
- మరుగుదొడ్లు అధ్వానం
- నేటికి పంపిణీ కానీ దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు, నోట్‌బుక్స్
- పెండింగ్‌లో డైట్ ఛార్జీలు

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక సంక్షేమ హాస్టల్స్‌ను పూర్తిగా విస్మరించింది. పలుచోట్ల అధ్వానస్థితిలో ఉన్నాయి. బయట ప్రైవేట్ హాస్టల్స్‌లో ఉండి చదువుకునే స్తోమత లేని పలువురు విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటూ గుంటూరు నగరం, మండలం కేంద్రంలోని ఆయా కాలేజీలకు, పాఠశాలలకు వెళుతుంటారు. అయితే, హాస్టల్స్‌లో కనీస అవసరాలు కూడా ప్రభుత్వం కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస మౌలిక వసతులు కల్పించకపోగా, నేటికీ డైట్, కాస్మోటిక్ చార్జీలు చెల్లించలేదు.

ఎస్సీ హాస్టల్స్‌పై మరింత చిన్న చూపు

గత వైఎస్సార్ ప్రభుత్వంలో విద్యార్థులకు డైట్ చార్జీలుపెంచింది. అయితే, వాటిని సకాలంలో అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందింది.ముఖ్యంగా ఎస్సీ హాస్టల్స్‌పై మరింత చిన్న చూపు చూపుతోంది. జూన్‌లో ఇవ్వాల్సిన దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసులు ఇంత వరకు ఇవ్వలేదు. కాస్మోటిక్ చార్జీలు కూడా ఇవ్వకపోవడంతో ఎస్సీ హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ.5 కోట్ల డైట్ చార్జీలు బకాయి

గుంటూరు జిల్లాలో 34 ఎస్సీ హాస్టల్స్‌లో 2,503 మంది, ఏడు ఎస్టీ హాస్టల్స్‌లో 697 మంది, 30 బీసీ హాస్టల్స్‌లో 2179 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 3 నుంచి 4వ తరగతి వరకు రూ.1150, 5 నుంచి 10వ తరగతి వరకు 1400, ఇంటర్ ఆపైన విద్యార్థులకు రూ.1600 ప్రతి నెలా డైట్ ఛార్జీలు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, ఎస్సీ హాస్టల్స్‌లో 6 నెలల నుంచి, బీసీ హాస్టల్స్‌లో 3 నెలల నుంచి డైట్ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్టీ హాస్టల్స్‌లో రెండు నెలల పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు వీరందరికి ప్రభుత్వం రూ.5కోట్లు పైనే బకాయిలు పడింది.

హాస్టల్స్ నిర్వహణ అధ్వానం

- రాజాగారితోటలోని ఎస్సీ బాలికల(చిన్న పిల్లల) హాస్టల్ శిథిలావస్థకు చేరింది. మరుగుదొడ్లు ఆధ్వానంగా మారాయి.
- నందివెలుగు రోడ్డులోని ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్‌లో మరుగుదొడ్లు సక్రమంగా లేవు. ఫ్యాన్లు, లైట్లు వెలగని పరిస్థితి.
- లాడ్జి సెంటర్‌లోని బీసీ హాస్టల్‌లో మరుగుదొడ్లను విస్తరణ చేయాల్సిన అవసరం ఉంది.

1న గుంటూరు 'గాట్ టాలెంట్ షో' కాంపిటేషన్



గుంటూరు మెడికల్: గుంటూరు సొసైటీ ఫౌండర్ డాక్టర్ షమా సుల్తానా నేతృత్వంలో 1న గుంటూరు 'గాట్ టాలెంట్ షో' కాంపిటేషన్ నిర్వహించనున్నారు. ఈ మేరకు పొన్నూరు రోడ్డులో ఉన్న ఎం కన్వెన్షన్ హాలులో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె తెలిపారు. సింగింగ్, డ్యాన్స్, స్టాండ్ అప్ కామెడీ, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫ్యాషన్ షో, మెహందీ, ఫన్నీ ఆర్ మెసేజ్, పొయెట్రీ, ఫన్నీ స్కిట్ లాంటి పోటీలను ఆంధ్ర ముస్లిం కాలేజ్ సమీపంలో ఉన్న ఎం కన్వెన్షన్ హాల్‌లో డిసెంబర్ 1, 8 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15న సెమీ ఫైనల్స్, డిసెంబర్ 22న ఫైనల్స్ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 8 గంటల వరకు పోటీలను నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సుల్తానా వెల్లడించారు. విజేతలకు మొదటి బహుమతి రూ. 10వేలు, రెండో బహుమతి రూ. 5వేలు, మూడో బహుమతి రూ. 3వేలు, రెండు కన్సోలేషన్ బహుమతులు రూ. వెయ్యి అందజేస్తామని తెలిపారు. పోటీల్లో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, సూపర్ సీనియర్స్‌ను విజేతలుగా ప్రకటించి క్యాష్ ప్రైజ్ ఇస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనేవారు రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 500లు చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 7780747616, 8886466233 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో షేక్ కరీం, అనిల్ కుమార్, ప్రైవేట్ స్కూల్ యూనియన్ ప్రెసిడెంట్ రామనాథన్, కేఎల్‌యూ యూనివర్సిటీ అమ్మిశెట్టి గిరిధర్, డాక్టర్ సారిక పి. నాగేశ్వర రావు, శరత్, సురేఖ, అల్లాబక్షు, షేక్ మస్తాన్ వలి పాల్గొన్నారు.

రజకుల సమస్యలపై వెంకటేశ్వర్లు ఎనలేని పోరాటం

నెహ్రూనగర్: ధోబీ ఘాట్స్ అభివృద్ధికి పిడుగురాళ్ల వెంకటేశ్వర్లు ఎనలేని కృషి చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు కొనియాడారు. వెంకటేశ్వర్లు వర్ధంతిని పురస్కరించుకుని గురువారం బీఆర్ స్టేడియం ఎదురుగా ఉన్న ధోబీ ఘాట్‌లో ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రజకుల సమస్యలపై అనునిత్యం పోరాటం చేసిన ఘనత వెంకటేశ్వర్లుకు దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు పిడుగురాళ్ల సురేష్‌బాబు, ఈమని ఉమామహేశ్వరరావు, వీరాస్వామి, గణేష్‌బాబు, లింగాల భిక్షం, రాము, ఆంజనేయులు పాల్గొన్నారు.

నివేదిక ముందే వచ్చేలా చొరవ తీసుకోవాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా సారథ్యంలో ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ నివేదికను గడువు కంటే ముందే ఇచ్చే విధంగా ప్రభుత్వం తగిన చొరవ తీసుకోవాలని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం గుంటూరులోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్గీకరణ నివేదిక రెండు నెలల కాలం పడుతుందని చెప్పిన నేపథ్యంలో అంతకంటే ముందే వచ్చేలా కమిషన్ చైర్మన్, ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎస్సీ వర్గీకరణ తరువాతే రాష్ట్రంలో ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేస్తామని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌లు చెప్పడం అభినందనీయమని తెలిపారు. కమిషన్ నివేదిక త్వరగా వచ్చినట్లయితే వేలాది మంది నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మాల ప్రజాప్రతినిధుల సూచనల మేరకు ఏబీసీడీ నాలుగు గ్రూపులుగా కాకుండా మూడు గ్రూపులుగా కుదించాలని చెప్పడం తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ ఏబీసీడీలో నుంచి డీని తొలగించి ఆ గ్రూపులోని వారిని సీ గ్రూపులో కలిపేందుకు మాదిగలుగా మేం ఒప్పుకోవమని స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15న మాలల మహా గర్జన

అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్న మాల, మాదిగలు మధ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ పేరుతో చిచ్చుపెడుతున్నాయని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీప్రసాద్ విమర్శించారు. గురువారం గుంటూరులోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం వర్గీకరణ పేరుతో ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు వర్గీకరణ పూర్తయ్యే వరకు ఉద్యోగ నోటిఫికేషన్లు నిలుపుదల చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం మందకృష్ణ మాదిగను గుడ్డిగా నమ్మి వర్గీకరణపై దూకుడుగా వ్యవహరిస్తుందని..రాష్ట్రంలో వర్గీకరణ చేయాలని చూస్తే సహించేదని లేదని హెచ్చరించారు. అఖిల భారత మాల సంఘాల జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్నవరపు కిషోర్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ పేరుతో కృత్రిమ ఉద్యమం నడుపుతున్నారని..10వ తరగతి పాస్ కాని మందకృష్ణ మాదిగ వర్గీకరణ అనంతరమే నోటిఫికేషన్లు అమలు చేయాలని చెబితే మంత్రి నారా లోకేష్ డీఎస్సీ నోటిఫికేషన్ ఆపివేయడం ఏపీలోని నిరుద్యోగులను మోసం చేయడమేనని విమర్శించారు. వర్గీకరణకు వ్యతిరేకంగా తమ ఊపిరి ఉన్నంత వరకు పోరాడుతామని...అలా కాదని వర్గీకరణ చేయాలని చూస్తే మాలలంతా ఏకమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాష్ట్రంలో మాలలందరితో కలిసి వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 15న మాలల మహాగర్జన గుంటూరులోని నల్లపాడు, హౌసింగ్‌బోర్డు వద్ద నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మాల సంఘాల నాయకులు మంచా నాగమల్లేశ్వరి, గుర్రం రామారావు, నల్లపు నీలాంబరం, బండ్లమూడి స్టాలిన్, బత్తుల అనిల్, చిన్నం డేవిడ్ విలియమ్స్, కె. వినయ్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- కమిషనర్ పులి శ్రీనివాసులు
- పలువురికి షోకాజ్ నోటీసులు జారీ



రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నిర్దేశిత గడువులోగా ప్రజలకు ప్రభుత్వ సేవలు అందించాలని, నిర్లక్ష్యంగా ఉండే ఏ స్థాయి అధికారి పైన అయినా చర్యలు తీసుకుంటామని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గడువు సమయం మించి ఫైల్ పరిష్కారం చేయకపోవడంపై పట్టణ ప్రణాళిక టీపీఎస్ సత్యనారాయణకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆయన డీపీఎంఎస్‌లో ఓ భవనానికి సంబంధించిన ఫైల్ 25 రోజుల పాటు తన లాగిన్‌లో ఉంచడంపై ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సిటీ ప్లానర్‌ని ఆదేశించారు.

తారకరామ నగర్ రోడ్డు విస్తరణకు చర్యలు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తారకరామ నగర్ రోడ్‌ని మాస్టర్ ప్లాన్ 60 అడుగులకు విస్తరణకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. తొలుత డొంక ఫిక్స్ చేసి ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని తెలిపారు. ఆయన గురువారం కమిషనర్ తారకరామ నగర్‌లో ప్రతిపాదిత విస్తరణ రోడ్డు, నాయి బ్రాహ్మణ కాలనీ, ఏటీ అగ్రహారం, రెడ్డిపాలెం, మంగళదాస్ నగర్ తదితర ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తారకరామ నగర్ మెయిన్ రోడ్‌ని మాస్టర్ ప్లాన్ మేరకు 60 అడుగులకు విస్తరణ చేయాల్సిన అవసరం ఉందని, విస్తరణపై ఇప్పటికే ప్రజా ప్రతినిధులు, స్థానికులు పలు అర్జీలు ఇచ్చారని తెలిపారు.అనంతరం ఏటీ అగ్రహారం రిజర్వాయర్, పంప్ హౌస్‌ని పరిశీలించారు. రిజర్వాయర్‌ని ప్రతి నెలా నిర్దేశిత గడువులోగా శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. నాయీ బ్రాహ్మణ కాలనీ, రెడ్డిపాలెంలో నూతన సీసీ రోడ్లను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని వాటికి బిల్లులు చెల్లించడం కుదరదని స్పష్టం చేశారు. మంగళదాస్ నగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తికి సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈలు మధుసూదన్, రమేష్ బాబు, శ్రీనివాస్, నాగభూషణం, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

తాగునీటి రిజర్వాయర్లను ప్రతి నెలా శుభ్రం చేయాలి

తాగునీటి రిజర్వాయర్లను ప్రతి నెలా శుభ్రం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులకు, ఎమినిటీ కార్యదర్శులకు స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం నగరంలో తాగునీటి సరఫరా, రిజర్వాయర్ల శుభ్రం, రోడ్ల విస్తరణ తదితర అంశాలపై ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎమినిటీ కార్యదర్శులు ప్రతి రోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో 10 ప్రాంతాల్లో క్లోరిన్ శ్యాంపిల్స్ తీయాలని ఆయన ఆదేశించారు. రిజర్వాయర్ల శుభ్రంపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రతి నెలా నిర్దేశిత షెడ్యూల్ మేరకు శుభ్రం చేయాలని ఏఈలను ఆదేశించారు. ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ నగరంలో కొన్ని రిజర్వాయర్‌లు పైన కప్పులు పటిష్టంగా లేవని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరావు, సూర్యనారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ సత్యసాయి విద్యా సంస్థలు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. సంగడిగుంటలోని కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యాసరచన ఆంగ్ల విభాగంలో బీఎస్సీ తృతీయ సంవత్సర విద్యార్థిని వి.పూజిత, బీకాం ద్వితీయ సంవత్సర విద్యార్థిని షేక్ హీనాకౌసర్ ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించినట్లు తెలిపారు. తెలుగు మాధ్యమ వ్యాసరచనలో బీకాం తృతీయ సంవత్సర విద్యార్థినులు ఎం. యోగేశ్వరలక్ష్మి, జి.ఈశ్వరమ్మ ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారని వివరించారు. ఇంటర్మీడియెట్ స్థాయిలో కె.శిరీష, వి. హారిక, పి. ప్రసన్న, సయ్యద్ జాస్మిన్ బహుమతులు గెలుపొందారని తెలిపారు. బాపూజీ కమిటీ ఉపాధ్యక్షులు కర్పూరపు సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే జీవితంలో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి వై. చంద్రశేఖర్, కల్చరల్ కో-ఆర్డినేటర్ మధుసూదనరావు, జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ సుభద్ర, అధ్యాపకులు జ్యోతి, స్వాతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కంప్యూటర్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు: రోడ్డు ప్రమాదంలో కంప్యూటర్ ఆపరేటర్‌కు తీవ్ర గాయాలైన ఘటన పాత మద్రాసు రోడ్డుపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పెదనందిపాడు మండలం గోగులమూడి గ్రామానికి చెందిన పఠాన్ జిలాని గుంటూరు నగరంలోని ఒక పొగాకు కంపెనీలో కంప్యూటర్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు. ప్రతిరోజూ స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై డ్యూటీకి వెళ్లి తిరిగి ఇంటికి వస్తాడు. ఎప్పటిలానే ఈ నెల 19వ తేదీ రాత్రి డ్యూటీకి వెళ్లి ముగించుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. గుంటూరు పర్చూరు పాత మద్రాసు రోడ్డుపై తిక్కిరెడ్డిపాలెం బస్ షెల్టర్ సమీపంలో గ్రామంలో నుంచి మెయిన్ రోడ్డుపైకి వస్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం అతి వేగంగా, వచ్చి జిలాని నడుపుతున్న మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గుంటూరులోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న జిలాని ప్రస్తుతం మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. దీంతో గురువారం అతడి తల్లి పఠాన్ జరీనా ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ కె. నాగేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

ప్రత్తిపాడు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వట్టిచెరుకూరు మండలం కొర్నెపాడులో అన్నదమ్ములు షేక్ జాన్ సాహెబ్, షేక్ చిన్నబాబు, పెద్దబాబు, షేక్ మహబూబ్ సుభానీలు నివాసముంటున్న పెంకుటిల్లు బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో ఆయా పోర్షన్లలో ఉన్న విలువైన వస్తువులు, సామాన్లు, పత్రాలు కాలిపోయాయి.

30న అన్నమయ్య గీతాల సహస్ర గళార్చన



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వక్తలు

నగరంపాలెం: గుంటూరు లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈనెల 30న శ్రీవెంకటేశ్వర స్వామికి గళార్చనతో నీరాజనం నిర్వహిస్తున్నట్లు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ తెలిపారు. పాఠశాల ఆవరణలో గురువారం సాయంత్రం జరిగిన విలేకర్ల సమావేశంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ తానా, దర్శనం టీవీ చానెల్ సంయుక్తంగా నీరాజనం నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఏకగళంతో అన్నమయ్య సంకీర్తనలు అలపిస్తారని, సుమారు 4 వేల మంది హాజరవుతారనే అంచనా ఉందని పేర్కొన్నారు. వెయ్యి మందితో అన్నమయ్య గీతాల సహస్ర గళార్చన నిర్వహిస్తామని తెలిపారు. పాల్గొనే వారు ఈనెల 25లోగా మొబైల్ రిజిస్ట్రేషన్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. తెలుగు వారి లోక కల్యాణార్థం సప్తగిరి కీర్తనలతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం ఐదు నుంచి ఎనిమిది గళార్చన కొనసాగుతుందని వెల్లడించారు. ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పలువురు హాజరవుతారని తెలిపారు. దర్శనం టీవీ చానల్ ప్రతినిధులు మహేష్ ధీరా, బండ్లమూడి స్వామి, తానా మాజీ కార్యదర్శి కొల్లా అశోక్, ఫ్యాంగ్ టెక్ సీఈఓ జిల్లెళ్లమూడి వెంకట్ పాల్గొన్నారు.

26న ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

లక్ష్మీపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో 26న నిర్వహించనున్న ర్యాలీ, బహిరంగ సభలను జయప్రదం చేయాలని సీఐటీయూఅధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ , ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు పిలుపునిచ్చారు. కొత్తపేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశ కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని కట్టు బానిసలుగా మారుస్తూ, వారి హక్కులను హరించి అన్ని వ్యవస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంలో భారతదేశ రాజ్యాంగం ఆమోదించిన రోజు అయిన నవంబర్ 26న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం, రైతాంగం సంయుక్తంగా నిరసన ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించాయని తెలిపారు. అందులో భాగంగా గుంటూరు నగరంలో నవంబర్ 26న ఉదయం 10:30 గంటలకు శంకర్ విలాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని చెప్పారు.

ఆరోగ్యకర జీవనానికి దంత సంరక్షణ కీలకం



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం ఆస్ట్రేలియన్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులకు ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ ఆరోగ్యమైన జీవనానికి దంత సంరక్షణ కీలకమైన అంశమని తెలిపారు. డాక్టర్ రావిపాటి అచ్యుత్ మాట్లాడుతూ దంతాలు ఆరోగ్యంగా ఉంటే మిగతా శరీర భాగాలు ఆరోగ్యవంతంగా ఉంటాయని చెప్పారు. విద్యార్థులకు డెంటల్ ఇంప్లాంట్స్ గురించి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా 360 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ భానుమురళి, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, కార్యక్రమ నిర్వహణ అధికారి ఆర్.జె. శైలజ, ఇంటర్ క్యాంపస్ ఇన్‌చార్జ్ జి. సురేష్ కుమార్, డాక్టర్ విష్ణు, మేనేజర్ బి. పవన్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.